కేసీఆర్ పాలంబాట పట్టాక సర్కారు కంటితుడుపు చర్యలు: హరీశ్‌రావు

దొంగ పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉన్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ పొలంబాట చేపట్టాక ప్రభుత్వం కంటితుడుపు చర్యలు ప్రారంభించిందని, గాయత్రి పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు, సాగర్ ఎడమకాల్వ నుంచి నీళ్లు విడుదల చేసిందని చెప్పారు. సిద్దిపేట కలెక్టర్ మను చౌదరికి ఆయన వినతిపత్రం అందజేశారు. మెదక్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి, జడ్పీ చైర్మన్ హేమలతాశేఖర్‌గౌడ్, సంగారెడ్డి కలెక్టరేట్‌లో డీఆర్వోకు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ వినతిపత్రాలు సమర్పించారు.

రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేయాలి: రవీంద్రకుమార్

ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నల్లగొండ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఆయన కలెక్టరేట్‌లో డీఆర్వో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ వినతిపత్రాలు అందించారు.

పరిహారం చెల్లించాల్సిందే: ఎంపీ నామా

సాగునీరు లేక ఎండిపోయిన వరి, మక్కజొన్న రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాల్సిందేనని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం కలెక్టర్‌కు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి నామా మెమోరాండం సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియానాయక్, తాటి వెంకటేశ్వర్లు, దిండిగల రాజేందర్ తదితరులు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి రైతుల సమస్యలపై కలెక్టర్ ప్రియాంక ఆలకు వినతిపత్రాన్ని అందజేశారు.

నిజామాబాద్‌లో వినతిపత్రాల అందజేత



కేసీఆర్ పిలుపు మేరకు పార్టీ నాయకులు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించారు. మాజీ స్పీకర్ పోచారం, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్ షిండే, సురేందర్ కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంత్‌కు వినతిపత్రం అందజేశారు.

అన్నదాతను ఆదుకోవాల్సిందే

ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాల్సిందే

- క్వింటా ధాన్యానికి 500 బోనస్ చెల్లించాల్సిందే
- లేదంటే తెలంగాణలో మరో ఉద్యమం తప్పదు
- కేసీఆర్ కదిలితేగానీ కండ్లు తెరవరా?: బీఆర్ఎస్
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): దేశానికి అన్నం పెట్టే రైతున్న ఆపదలో ఉంటే ప్రభుత్వం ఆదుకోవాల్సిందేనని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. నీళ్లు లేక పంటలు ఎండి అల్లాడుతున్న రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని కోరింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందాల్సిందేనని స్పష్టంచేసింది. లేనిపక్షంలో తెలంగాణలో మరో ఉద్యమం మొదలైతదని హెచ్చరించింది. అన్నదాతను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలు, కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ శ్రేణుల్లో ఉద్యమస్ఫూర్తి తొణికిసలాడింది. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్లు, నగరపాలక సంస్థల ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో జిల్లా సమీకృత కలెక్టరేట్లు కిక్కిరిసిపోయాయి. తొమ్మిదిన్నరేండ్లపాటు అధికారంలో ఉన్నా ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పాత్రలో అయినా తాము ప్రజల కోసమే, ప్రజల ప్రయోజనాలే తమకు ముఖ్యమని బీఆర్ఎస్ పార్టీ మరోసారి నిరూపించింది.

కేసీఆర్ కదిలితేగానీ..

రాష్ట్రంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులను అంచనావేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి మనసులేదని, తమ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగితే కానీ సాగునీటి కోసం రైతులు అల్లాడుతున్న దయనీయ పరిస్థితిని కాంగ్రెస్ సర్కారు గుర్తించలేకపోటం దారుణమని బీఆర్ఎస్ పార్టీ భగ్గుమంటున్నది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 200 మందికి పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. రైతుల దుర్భర పరిస్థితులను గ్రహించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో పర్యటించి రైతులను ఓదార్చిన విషయం తెలిసిందే. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు దక్కాల్సిన ప్రయోజనాలను సమకూర్చాలనే ఉద్దేశంతో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగానికి జరిగిన నష్టాన్ని అంచనావేసేందుకు అధికారుల బృందాన్ని క్షేత్రస్థాయికి పంపాలని, నష్టపోయిన ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనగా వెళ్లి కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించాయి.

సర్కారు నిర్లక్ష్యంతోనే కరువు: శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరువు ఛాయలు నెలకొన్నాయని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎమ్మెల్యేలు బండ్ల, విజయుడు, నాగర్‌కర్నూల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి: ఎమ్మెల్యే సంజయ్

రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశారు. పెద్దపల్లిలో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జగిత్యాలలో అదనపు కలెక్టర్ రాంబాబుకు కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, సిరిసిల్ల అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ వినతిపత్రాలు అందించారు.

ఆపదలో ఉన్న రైతన్ననుఆదుకోవాలని వరంగల్‌లో వినతులు

రైతులను ఆదుకోవాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలెక్టర్లకు వినతిప్రతాలు సమర్పించారు. మహబూబాబాద్‌లో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, హరిప్రియనాయక్, శంకర్‌నాయక్ కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వరంగల్‌లో కలెక్టర్ పీ ప్రావీణ్యకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జనగామలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు గిరబోయిన భాగ్యలక్ష్మి, పోకల జమున, ములుగులో కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌కు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి వినతిపత్రాలు అందజేశారు.

పంట కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించండి: కోవ లక్ష్మి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఇటీవలి వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రాలు అందించారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షాకు, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌కు, నిర్మల్‌లో ఏవోకు, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో ఏవో రఫత్‌కు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాహితమా.. ప్రచారమా?

మొదటిపేజీ తరువాయి...

ప్రయత్నాలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పిటిషనర్లను హెచ్చరించింది. ఇవి ప్రజాహిత వ్యాజ్యాలా? ప్రచార వ్యాజ్యాలా? అంటూ నిలదీసింది. అవినీతి జరిగిందనడానికి ఆధారాలు ఏమున్నాయని ప్రశ్నించింది.

ప్రభుత్వ వాదనలు కూడా వింటాం

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, అవినీతి చోటు చేసుకున్నదని, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, బీ రామ్మోహన్‌రెడ్డి, వ్యక్తిగత హోదాలో ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి, ముదిగంటి విశ్వనాథరెడ్డి, బక్క జడ్సన్ వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్లకు పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వ వాదనలు వినకుండా ఏవిధమైన ఆదేశాలూ ఇవ్వలేమని ప్రకటించింది. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలన్న పిటిషనర్ల అభ్యర్థనపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి వెల్లడించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది.

ఈ రోజే దోషులకు శిక్ష వేయాలా?

వ్యక్తిగత హోదాలో కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ.. గత రెండేండ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాలపై కీలక సమాచారాన్ని సేకరించినట్టు చెప్పారు. ఏ రాష్ట్రంలోనూ లేనట్టుగా తెలంగాణలో భారీ ఎత్తున కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని అన్నారు. వెంటనే అడ్డుకున్న హైకోర్టు, ఈ వ్యవహారంపై ఇప్పటికిప్పుడే అంటే ఈరోజునే తేల్చేయాలా? అని ప్రశ్నించింది. పిటిషన్లను అనుమతించి, తప్పులు చేసిన అవినీతిపరులను జైళ్లకు పంపాలా? అని పేర్కొన్నది. హైకోర్టు రాజకీయ వేదిక కాదని, కాళేశ్వరం అంశాన్ని ఎన్నికల ఎజెండాగా మార్చేసి వాదనలు వినిపిస్తే వినాలా? అని నిలదీసింది. కేసుల విచారణలో కోర్టులకు ఒక విధానం అంటూ ఉంటుందని గుర్తుచేసింది. ప్రభుత్వ వాదనలు కూడా వినాల్సి వుంటుందని, ఆ తర్వాతే తగిన ఆదేశాలు జారీచేస్తామని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎలా తెలిసిందని నిలదీసింది. అవినీతి, అక్రమాల గురించి పిల్‌లో ఎక్కడ పేర్కొన్నారని ప్రశ్నించింది. మీడియాలో వచ్చిన కథనాలేనా మీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా? అని అడిగింది. పిల్‌లో మీడియాలో కథనాలు వచ్చాయని మాత్రమే పేర్కొన్నారని, అవినీతి, అక్రమాలపై ఆధారాలు ఏమీ పేర్కొనలేదని తప్పుపట్టింది. మీరుగా ఏమైనా అధ్యయనం చేశారా, పరిశోధన ఏమైనా చేశారా? అని ప్రశ్నించింది. మీరు చేసిన పరిశోధనలేమిటో, ముడుపులు చేతులు మారాయనడానికి ఆధారాలు ఏమిటో చెప్పాలని నిలదీసింది. 'ప్రాజెక్టు 4 పిల్లర్స్‌కు మరమ్మతు చేయించాలంటే మేము అక్కడికి వెళ్లి పనులు చేయించాలా? అది కూడా ఇప్పుడే వెళ్లాలా? పోనీ ఒక పనిచేద్దామా.. అందరూ కలిసి ప్రాజెక్టు దగ్గరకు వెళ్లి అడ్డుగా నిలబడదామా?' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. ముందుగా ప్రజాప్రయోజన వ్యాజ్యం ఎలా వేయాలో తెలుసుకోవాలని హితవు చెప్పింది. హైకోర్టు నిబంధనల ప్రకారం పిటిషన్‌ను సవరించి తిరిగి దాఖలు చేయాలని సూచించింది.

పిల్ నాదని చెప్పుకోడానికి వీల్లేదు..

ప్రజాహిత వ్యాజ్యమంటే ప్రజా సమస్యను కోర్టు దృష్టికి తేవడమని, ఆ తర్వాత ఏం చేయాలో కోర్టులు నిర్ణయిస్తాయని హైకోర్టు స్పష్టంచేసింది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపింది. సుప్రీంకోర్టు చెప్పిందే చట్టమని పేర్కొంది. పిల్స్ విచారణకు న్యాయవాదుల సహకారం అవసరమేగానీ విచారణలో వాదనలకు అవసరం లేదని తెలిపింది. ఇది మా వ్యాజ్యమని చెప్పడానికి ఇదేమీ సర్వీస్ వివాదం కాదని పేర్కొంది.

రాజకీయ ప్రయోజనంతో వేశారా?

ఇతర వ్యాజ్యాలతో తమ పిల్‌ను జత చేయరాదని, కేఏ పాల్ పిల్‌ను విడిగా విచారణ చేయాలని బక్క జడ్సన్ తరపు న్యాయవాది ఎస్ శరత్ కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ప్రొఫెసర్ కోదండరాం తరపు న్యాయవాది గడువు కావాలని కోరుతున్నారని, మీరేమో ఇప్పుడే విచారణ చేయాలంటున్నారని, ఒకే అంశంపై దాఖలైన వ్యాజ్యాలను వేర్వేరుగా విచారణ చేయలేమని స్పష్టంచేసింది. విడిగా విచారణ చేయాలన్నదే మీ అభిమతమైతే.. తిరస్కరిస్తూ రాత పూర్వక ఆదేశాలిస్తామని స్పష్టం చేసింది. విశ్వనాథ రెడ్డి తరపు న్యాయవాది జీ నందిత వాదనలు వినిపిస్తూ పిల్‌ను ఎన్నికలకు ముందే గత నవంబర్‌లో దాఖలు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారకముందే వేశామన్నారు. పిల్‌కు నంబర్ ఇచ్చేందుకు ఆలస్యమైందని చెప్పడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఇది రాజకీయ ప్రయోజనాలతో దాఖలు చేశారా అని ప్రశ్నించింది. పిటిషన్ తొలి విచారణకు వచ్చినపుడు న్యాయవాదిగా మీరెందుకు రాలేదని కూడా ప్రశ్నించింది. ఇప్పటికిప్పుడు విచారణ చేయబోమని, ప్రభుత్వ వాదనలు వినాల్సివుందని, సీబీఐ దర్యాప్తునకు ఇవ్వాలన్న అభ్యర్థనలపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని ఆదేశించింది. ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ హాజరయ్యారు.

పలు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసిన హైకోర్టు

ముడుపులు చేతులు మారాయని ఎలా తెలిసింది? అవినీతి జరిగిందని ఎలా చెబుతున్నారు? దీనికి సంబంధించిన ఆధారాలు ఏవి? ముడుపుల పాత్ర గురించి ఎలా తెలుసు? 2016లో కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభిస్తే ఇప్పటివరకు అవినీతి జరిగిందని తెలియదా? ఇంతకాలం ఏం చేస్తున్నారు? కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి బాగోతంపై పత్రికలు, టీవీల్లో వచ్చిన కథనాలు కాకుండా మీరు చేసిన పరిశోధన ఏమిటి? అసలు ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని ఎలా తెలిసింది? అవినీతి జరిగితే ఎవరికి ఫిర్యాదు చేశారు? దానిపై స్పందన ఏమైనా ఉందా? ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించామని చెబుతుండగా, దీనిపై తాము గతంలో ఉత్తర్వులు ఇచ్చామని చెబుతున్నా పట్టించుకోరా? ఇప్పటికిప్పుడు విచారణ చేసి మీరు కోరినట్లుగా ఉత్తర్వులు ఇవ్వాలా? మీతో ఏకీభవించి ఇప్పటికిప్పుడు తప్పు చేసిన వాళ్లను కటకటాల వెనక్కి పంపాలా?.. అని పిటిషనర్లను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

..ఎందుకు చెప్పలె?

మొదటిపేజీ తరువాయి...

అనుమతి ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల తర్వాత పొలంబాట పట్టడం సంతోషకరమని తెలిపారు. మాజీ సీఎం అయిన కేసీఆర్‌కు ఏ సీజన్‌లో కరువు వస్తుందో తెలియదా? అని ప్రశ్నించారు. నిరుడు బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే వర్షాలు కురవలేదని, ఆ కారణంగానే కరువు వచ్చిందని చెప్పారు. ఇప్పుడు ఆ పాపాలను తమ ఖాతాలో వేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు వేసేందుకు 10 నెలల సమయం తీసుకుందని, వారు ఎప్పుడెప్పుడు రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశారో ఆ వివరాలన్నీ ఉన్నాయని, కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చూపించాలని అనుకుంటున్నట్టు చెప్పారు. తాము ఇప్పటికే 65 లక్షల మంది రైతుల ఖాతాలో డబ్బులు జమచేశామని, మిగిలింది 4 లక్షలమంది రైతులేనని తెలిపారు.

జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి నిందలా?

జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి విద్యుత్తు పోయిందని తమ ప్రభుత్వంపై కేసీఆర్ నిందలు వేస్తున్నారని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఏదైనా సమస్యపై తాము ఆందోళనకు పిలుపునిస్తే అరెస్ట్ చేసేవారని, కానీ తాము అలా చేయడం లేదని గుర్తుచేశారు. కేసీఆర్ పర్యటనకు తాము అన్ని ఏర్పాట్లు చేశామని, తాము తలచుకుంటే కేసీఆర్ అసలు బయటకు వచ్చేవారే కాదని పేర్కొన్నారు. బాండ్ల రూపంలో వచ్చిన రూ.1500 కోట్లు బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయని, ఆ పాపపు సొమ్ము నుంచి రైతులకు ఓ రూ.100 కోట్లు సాయం చేయవచ్చు కదా అని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే కేసీఆర్ పొలంబాట పేరుతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తమకు సూచనలు చేస్తే, వాటిలో న్యాయమైనవైతే అమలు చేస్తామని తెలిపారు. .

తుక్కుగూడ సభలో మ్యానిఫెస్టో

6న తుక్కుగూడలో జరిగే సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ మ్యానిఫెస్టో విడుదల చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో కలిసి సభా ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సభకు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ హాజరవుతారని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా చెప్తామని పేర్కొన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎన్నికల కోడ్ ముగిశాక మిగతా హామీలను అమలు చేస్తామని తెలిపారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి సర్కారేనని, జూన్ 9న ఢిల్లీ రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ప్రమాణ స్వీకారం ఉంటుందని రేవంత్‌రెడ్డి జోస్యం చెప్పారు.